## రాహుల్ రెండో విడత యాత్రతో రాజకీయాల్లో పెను మార్పు


ఏగూరి ఉదయ్‌కుమార్

**ఉస్మానియా యూనివర్సిటీ:** కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ఈ నెల 14 నుంచి చేపట్టనున్న రెండో విడత పాదయాత్రతో జాతీయ రాజకీయాల్లో పెను మార్పు సంభవిస్తుందని టీపీసీసీ మాజీ జాయింట్ సెక్రటరీ, ఓయూ జేఏసీ నేత ఏగూరి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. మొదటి విడత చేపట్టిన భారత్ జోడో యాత్రతో దక్షిణాదిన పుంజుకున్న పార్టీ రెండో విడతలో ఉత్తరాదిన మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ నెల 14న ముంబయిలో ప్రారంభమై మణిపూర్ వరకు 6,700 కిలోమీటర్ల వరకు చేపట్టబోవు పాదయాత్ర ప్రజలను ప్రభావితం చేస్తుందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక, లౌకికవాద భావాలకు తిలోదకాలిచ్చిన బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని జోష్యం చెప్పారు. తెలంగాణలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన బీఆర్ఎస్ నేతలకు కూడా పార్లమెంట్ ఎన్నికల ఫీవర్ పట్టుకుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టిన నెల లోపే పథకాల అమలుపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

## 30 రోజుల కాంగ్రెస్ పాలనపై సంబురాలు



**ఉస్మానియా యూనివర్సిటీ:** కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 30 రోజులైన సందర్భంగా ఓయూలో విద్యార్థులు, నిరుద్యోగులు కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నెల రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో సీఎంతో పాటు మంత్రులు చేస్తున్న కృషిని అభినందించారు. భవిష్యత్ సుపరిపాలనకు ఇది తొలిమెట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ బాలలక్ష్మీ, డాక్టర్ రామేశ్వర్‌రావు, శ్రీను, జానకిరాములు, వెంకట్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలి



**లాలాపేట:** తార్నాక డివిజన్ లాలాపేట ప్రధాన రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు బెజ్జాల కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం ఆయన లాలాపేట ఫ్లై ఓవర్ సమీపంలోని సిగ్నల్ వద్ద ట్రాఫిక్ జామ్ తలెత్తడంతో కాసేపు ఆయన ట్రాఫిక్ నియంత్రణకు సహకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిగ్నల్ సిస్టమ్ ఉన్నప్పటికీ వాహనదారులు నిబంధనలు పాటించకుండా వెళ్తుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తే సమస్య కొంత మేరకు తీరుతుందని కృష్ణమూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

**రాంగోపాల్‌పేట్:** సంక్రాంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. మహిళలు, యువతులు పాల్గొని అందమైన రంగవల్లులను తీర్చిద్దారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గిర్మపురం భాస్కరచారి మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ వచ్చిందంటే మహిళలు అందమైన రంగవల్లులు వేసి అలరిస్తారని వారిలోని కళను గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సంధ్య, సంధ్యాదేవి, షణ్ముఖ ప్రియలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వీరాచారి, వీరాంజనేయులు, శివకుమార్, కిషన్‌రావు పాల్గొన్నారు.

## మానసికోల్లాసానికి క్రీడలు దోహదం


ముగింపు వేడుకల్లో పాల్గొన్న పణిక్కర్

**సనత్‌నగర్:** శారీరక దృఢత్వం తో పాటు మానసికోల్లాసంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సౌత్ రీజియన్ రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌జీ పణిక్కర్ అన్నారు. ఆల్ ఇండియా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్ 2023–24 ముగింపు వేడుకలు ఆదివారం బేగంపేట ఎయిర్‌పోర్ట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పణిక్కర్ మాట్లాడుతూ.. గెలుపోటములు సహజమని గెలిచిన వారు మరింత స్ఫూర్తితో ముందుకు సాగాలని, ఓడిన వారు ఎలాంటి ఆత్మవిశ్వాసంతో ముందుడుగు వేసి విజయం సాధించాలన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ (సీఏసీ) జీఎం హజారీ, సదరన్ రీజియన్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## గడప గడపకూ అక్షింతల వితరణ


అక్షింతల కలశాన్ని ఊరేగిస్తున్న భక్తులు


శోభాయాత్రలో పాల్గొన్న రామకృష్ణ

**సనత్‌నగర్:** శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సరఫరా చేసిన శ్రీరామ అక్షింతల కలశం ఊరేగింపు కార్యక్రమం సనత్‌నగర్‌లో వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాల నడుమ శివాజీనగర్, ఎస్ఆర్‌టీకాలనీల్లో అక్షింతలను ఊరేగించి గడప గడపకూ అందజేశారు. అశ్విని, వంశీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సదాశివయాదవ్, మహేష్, క్రాంతికుమార్, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, సుమన్‌కుమార్, కుషల్‌కుమార్, అనురాధ, సురేందర్, మురళి పాల్గొన్నారు.

**వాసవీనగర్‌లో..**

**రసూల్‌పురా:** అయోధ్య రామ మందిరం దేశ ప్రజల స్ఫూర్తి కేంద్రమని బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకష్ణ అన్నారు. వాసవీనగర్‌లో నిర్వహించిన అక్షింతల శోభాయాత్రలో ఆయన పాల్గొని ఇంటింటికీ వితరణ చేశారు.

# ఖాళీ స్థలాలు.. కబ్జాదారుల పాలు!

### నిరుపయోగంగా ప్రభుత్వ జాగాలు

- అధికారుల పర్యవేక్షణ లేక కనుమరుగయ్యే ప్రమాదం
- ప్రజావసరాలకు వినియోగించాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

**లాలాపేట:** ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలను పరిరక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో కబ్జాకోరల్లో చిక్కుకుపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇదే అదునుగా భావిస్తున్నా కబ్జాదారులు వాటిని తమ సొంతం చేసుకునేందుకు కసరత్తులు చేస్తున్నారని లాలాపేట, తార్నాక ప్రాంతాల వాసులు ఆరోపిస్తున్నారు. 'అది కచ్చింగా ప్రభుత్వ స్థలమే అని మీకు, మాకు తెలిసినప్పటికి సదరు కబ్జాదారులు న్యాయస్థానాల ముందు ధృవపత్రాలను (తప్పడు డ్యాడ్యుమెంట్స్) సమర్పించడంతో తమ లాంటి అధికారులు సైతం ఏమి చేయలేక తామే దగ్గరుండి ఇది మీ స్థలం అంటూ కబ్జాదారులకు అప్పజెప్పాల్సి వస్తోందని' తార్నాకలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలం విషయమై గతంలో సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీలో పని చేసిన ఓ అధికారి (కరోనాతో మృతి చెందాడు) ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

**రూ. కోట్లలో విలువ చేసే భూములు..**

తార్నాక, లాలాపేట ప్రాంతాల్లో రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు సంవత్సరాల తరబడి వదిలేయడంతో చెట్లు, పిచ్చి మొక్కలు మొలిచాయి. మరి కొన్ని ప్రాంతాల్లో స్థానికులు చెత్తను డంప్ చేసే కేంద్రాలుగా, ప్రైవేట్ పార్కింగ్ సెంటర్లు ఉపయోగించుకుంటున్నారు. స్థానిక ప్రజల కోసం గతంలో ఏర్పాటు చేసిన టాయిలెట్ స్థలాలు, పార్కు స్థలాలను ఇప్పటికే కొందరు ఆక్రమించి వాటిలో పక్కా భవనాలను సైతం నిర్మాణం చేసుకుని అనుభవిస్తున్నారు. ఇంకా కొన్ని స్థలాలపై కన్నేయడంతో వివాదాలు కోర్టుల్లో ఉన్నాయి.

**ప్రభుత్వ స్థలాలున్న ప్రాంతాలు..**

గడి స్కూల్ సమీపంలో 800 గజాలు, మంజరీ నర్సింగ్ హోమ్ ఎదురుగా దాదాపు వెయ్యి గజాల స్థలం, లాలాపేట విద్యామందిర్ స్కూల్ సమీపంలో దాదాపు 250 గజాలు, తార్నాక విజయపురి కాలనీలో దాదాపు 2 వేల గజాల ప్రభుత్వ స్థలాలు ఖాళీగా నిరుపయోగంగా దర్శనం ఇస్తున్నాయి. ఆ భూముల్లో ప్రభుత్వ స్థలం అని బోర్డులు ఏర్పాటు చేశారు. తార్నాక ఎర్రకుంట చెరువు సమీపంలో చాలా మంది చెరువు భూములను ఆక్రమించి పక్కా భవనాలు నిర్మాణం చేశారు.


లాలాపేటలోని ప్రభుత్వ స్థలం

### ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించాలి



రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేయడానికి కేటాయించాలి. ఇప్పటికే కొందరు కబ్జాదారులకు అధికారులు పరోక్షంగా సహకరించడంతో విలువైన ప్రభుత్వ స్థలాలను కొల్లగొట్టారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను పరిరక్షించి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలి.

–కుమ్మరి అంజనేయులు, లాలాపేట

## పట్టణ ఉపాధి హామీని ప్రవేశపెట్టాలి


సదస్సులో మాట్లాడుతున్న పులి కల్పన

**అడ్డగుట్ట:** అసంఘటిత కార్మికులకు పట్టణ ఉపాధి హామీని ప్రవేశపెట్టాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. జాతీయ ప్రజా ఉద్యమాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న అసంఘటిత పట్టణ కార్మికుల హక్కులు, పోరాటాలపై జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గృహ, భవన నిర్మాణ తదితర అసంఘటిత కార్మికులకు జాతీయ పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి హక్కుగా పనులు కల్పించాలన్నారు. సామాజిక భద్రత చట్టాన్ని అమలు చేయకుండా 47 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తుందన్నారు. గృహ, భవన నిర్మాణ, వీధి వ్యాపారుల, గిగ్ ప్లాట్ ఫాం, వలస కార్మికులకు ప్రభుత్వమే హక్కుగా పని కల్పించి కనీస వేతనాలను అందించి ప్రమాద, ఆరోగ్య భీమా పథకాలను అమలు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున అసంఘటిత కార్మికుల ఎన్నికల ఎజెండాను రూపొందించి జనవరి 26న విడుదల చేసి రాజకీయ పార్టీలకు అందించాలని జాతీయ సదస్సు నిర్ణయించిందన్నారు.


## ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

**అడ్డగుట్ట:** ముదిరాజ్ రిజర్వేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత ముదిరాజ్(కోలి)సంక్షేమ సంఘం అధ్యక్షులు పొట్లకాయల వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ముదిరాజన్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మారుస్తామని శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిదన్నారు. గత 13 ఏళ్ల నుంచి బీసీ కమిషన్ రిపోర్ట్ రాష్ట్రం నుంచి పంపించకపోవడంతో సుప్రీం కోర్టులో ఉన్న కేసు పెండింగ్‌లోనే ఉందన్నారు. కోర్టు సైతం బీసీ కమిషన్ రిపోర్టును పంపాలని కోరిందని కాబట్టి బీసీ కమిషన్ రిపోర్టును వెంటనే సుప్రీం కోర్టుకు పంపి ముదిరాజ్‌లకు న్యాయమైన హక్కులను పొందేందుకు సహకరించాలని వినతిలో కోరారు. అదే విధంగా ప్రభుత్వం త్వరలో విడుదల చేయబోయే జాబ్ కేలండర్ నియామకాల్లో ముదిరాజ్‌ల వాటా దక్కే విధంగా చూడాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో శ్రీనివాస్ రాజ్, ఆలేటి సురేష్, సాయితేజ ఉన్నారు.

## సమస్యల పరిష్కారం.. అభివృద్ధే ధ్యేయం

### బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకష్ణ


పనులకు శంకుస్థాపన చేస్తున్న రామకృష్ణ

**రసూల్‌పురా:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధే తమ లక్ష్యమని బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకష్ణ పేర్కొన్నారు. ఆరో వార్డు జీఎల్.యాదవ్ నగర్ కాలనీలో ఆదివారం పార్క్ స్థలంలో ప్రహరీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పార్క్ అభివద్ధి, జిమ్ వాకింగ్ ట్రాక్, కమ్యూనిటీ హాల్ రోడ్డు వసతి తదితర సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అభివద్ధి పనులకు నిధులు కేటాయించినా గత ప్రభుత్వం సహకరించకపోవడంతో అభివద్ధి జరగలేదని నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరిస్తుందో వేచి చూద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బానుక మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## నేడు శంకరాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆరాధనోత్సవాలు


మాట్లాడుతున్న ఎల్వీ సుబ్రహ్మణ్యం

**బన్సీలాల్‌పేట్:** పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో సోమవారం కంచి కామకోటి 68వ పీఠాధిపతి శంకరాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి పరమాచార్య స్వామివారి ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్, మాజీ ఐఏఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. పద్మారావునగర్‌లోని ఆలయంలో మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి, కార్య నిర్వాహణ అధికారి చల్ల విశ్వనాథ శాస్త్రితో కలిసి విలేకరులతో మాట్లాడారు. నడిచే దేవుడిగా ప్రసిద్ధి గాంచిన 1994 జనవరి 8వ తేదీన చంద్రశేఖరేంద్ర సరస్వతి శివైక్యం చెందారని అన్నారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నుంచి స్కందగిరి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం, దేవాదాయ శాఖలకు చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో భగవద్గీత, రామాయణ, ఉపనిషత్తులు, శ్లోకాల పారాయణం, సదాశిత బ్రహ్మేంద్ర కృతులు, పంచరత్న కృతులు, గురు కృతుల సామూహిక పారాయణం ఉంటుందన్నారు. నగర పర్యటనలో ఉన్న ప్రస్తుత కంచి కామకోటి 70వ పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి డి. శ్రీధర్ బాబు, కేరళకు చెందిన ఎడ్నీర్ మఠాధిపతి హాజరవుతారన్నారు.

## యువతి అదృశ్యం

**సనత్‌నగర్:** గుడికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంపేట మయూరి మార్గ్‌కు చెందిన రంజని ప్రియ (23) టెలీకాలర్‌గా పని చేస్తోంది. అనారోగ్యం కారణంగా ఇటీవల ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటుంది. ఈ నెల 5న గుడికి వెళ్తున్నట్లు చెప్పిన రంజని ప్రి య ఎంతకీ ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**సనత్‌నగర్:** ఆల్విన్, లోధా, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అల్లావుద్దీన్ కోఠి, ఓల్డాస్, టయోటా షోరూం లేన్, సనత్‌నగర్ ఫైర్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్, 3ఆర్‌టీ, ఫతేబాగ్, సనత్‌నగర్ మెయిన్ రోడ్డు, బేగంపేట పేస్ హాస్పిటల్, గురుమూర్తి లేన్, మోతీలాల్‌నెహ్రూనగర్, నెహ్రూనగర్, ఎయిర్‌కార్గో, భగత్‌సింగ్‌నగర్, శ్యామ్‌లాల్ బిల్డింగ్స్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ ఏరియా, డి–మార్ట్ ఏరియా, టయోటా షోరూం లేన్, స్కోడా షోరూం లేన్, జెన్ టెక్నాలజీ ఏరియా, ఆంధ్రాబ్యాంక్ లేన్, బేగంపేట ఫ్లైయాష్, ఎస్‌బీటీనగర్, వికార్‌నగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

## నేడు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

**లాలాపేట:** తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు రాము వర్మ, అజయ్‌ముదిరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్తీలోని ఏడుగుళ్ల దేవాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఉజ్వల పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆధార్ అప్డేట్ వంటి వాటికి అప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు.

## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

**సనత్‌నగర్:** టమాటా రూ.21, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 55, పందిరి బీర 40, క్యాబేజీ 18, క్యారెట్ 33, దొండ 28, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 50, గోకరకాయ 45, కీర 15, దోసకాయ 28, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 21, చామగడ్డ 50, మొరంగడ్డ 25, కందగడ్డ 25, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

## డాక్టరేట్ ప్రదానం


బంధం సైదులు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ గణితశాస్త్రం విభాగంలో బంధం సైదులుకు డాక్టరేట్ వరించింది. గణితశాస్త్రం విభాగం అధ్యాపకులు డాక్టరేట్ శ్రీరామ్ రెడ్డి పర్యవేక్షణలో క్యారెక్టరిస్టిక్స్ ఆఫ్ మ్యాగ్నటో హైడ్రోడైనమిక్ మైక్రోపోలార్ నానోఫ్లూయిడ్ ఫ్లోటువర్డ్స్ స్ట్రేచింగ్ షీట్ ఇన్ ద ప్రజెన్స్ ఆఫ్ హీట్ అండ్ ట్రాన్స్‌ఫర్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది.

## శ్రీముఖి సందడి



ఎస్ఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఆటమ్న్ సెలూన్‌ను ఆదివారం యాంకర్ శ్రీముఖి ప్రారంభించి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫ్యాషన్ గా ఉండటమే కాదు.. మరింత అందంగా కనిపించేందుకు నేటితరం ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు. –లక్డీకాపూల్

## సమష్టి కృషితోనే జాతీయ అవార్డులు


మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి

**లాలాపేట:** స్వచ్ఛ భారత్ పట్టణ విభాగంలో గ్రేటర్ హైదరాబాద్‌కు స్వచ్ఛ సర్వేక్షణ్–2023 జాతీయ స్థాయి అవార్డులు రావడంపై డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నిరంతరం జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలకు ప్రతిఫలంగా ఈ అవార్డులు దక్కాయన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది, కార్మికులందరీ సమష్టి కృషితో ప్రతిఏటా జీహెచ్‌ఎంసీ అవార్డులు దక్కించుకుంటుందన్నారు. జీహెచ్‌ఎంసీ యంత్రాంగానికి ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఉద్యమకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**ఉస్మానియా యూనివర్సిటీ:** తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలంతో పాటు ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆదివారం డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసినందునే అధికారం కోల్పోయిందన్నారు. పదవుల్లో అవకాశం కల్పించక, ఉద్యోగాలు రాక ఉద్యమకారులు అనేక విధాలుగా నష్టపోయారని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు.

**నేడు ఉద్యమకారుల సమావేశం**

నేడు ఆర్ట్స్ కాలేజీలోని న్యూ సెమినార్ హాల్లో మధ్యాహ్నం 1.30 లకు తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి 2009 నుంచి 2014 జరిగిన ఉద్యమంలో భాగస్వాములైన విద్యార్థి నేతలు హాజరుకావాలని పరిశోధన విద్యార్థి కంచర్ల బద్రీ విజ్ఞప్తి చేశారు.

## రాజీ మార్గంతో వివాదాలకు పరిష్కారం


మాట్లాడుతున్న సత్యానారాయణ

**ఉస్మానియా యూనివర్సిటీ:** రాజీమార్గం ద్వారా రియల్ ఎస్టేట్ బిల్డర్లకు కొనుగోలుదారుల మధ్య జరిగే వివాదాలను త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రెరా చైర్మన్ డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ఓయూ క్యాంపస్ న్యాయ కళాశాలలో జరిగిన పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం నూతన సంవత్సర కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున, సురేష్, లాయర్ సంద్యాల దయాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, జీపీ రెడ్డి పాల్గొన్నారు.

## మాలల ఐక్యతతోనే హక్కుల సాధన

**ఉస్మానియా యూనివర్సిటీ:** మాలల ఐక్యతతోనే హక్కులు సాధించుకుంటారని ఆల్ మాల స్టూడెంట్స్ యూనియన్ (అంసా) రాష్ట్ర అధ్యక్షులు ప్రదీప్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మంచాల లింగస్వామి పేర్కొన్నారు. ఆదివారం జాతీయ మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన మాలల అలయ్ బలయ్ కార్యక్రమంలో పే బ్యాక్ టు సొసైటీ వారు రూపొందించిన కేలండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్‌తో పాటు ఓయూ విద్యార్థి జేఏసీ నాయకురాలు టి.శ్వేత, మాల సంఘం రాష్ట్ర నాయకులు తల్లమల్ల హుస్సేన్, జాతీయ నేత భవత్‌నాథ్ పాశ్వాన్ పాల్గొన్నారు

## కేలండర్ల ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ.కోదండరామ్

**ఉస్మానియా యూనివర్సిటీ:** పెరిక ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ సొసైటీ(పెప్స్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కేలండర్‌ను టీజేఎస్ అధ్యక్షులు ప్రొ.కోదండరామ్ ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పెరిక సామాజిక వర్గం అండగా నిలిచిందని వారి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెరికల అభివృద్ధికి ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలని పెప్స్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తిప్పని సిద్దులు, చింతల లక్ష్మీనారాయణ, సతీష్‌కుమార్, రాధాకృష్ణ, వెంకటయ్య పాల్గొన్నారు.

**రసూల్‌పురా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..**



**రసూల్‌పురా:** కంటోన్మెంట్ బోర్డు రెండో వార్డు రసూల్‌పురా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్ కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, సంఘం ప్రతినిధులు నర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్యాంరెడ్డి, విష్ణురెడ్డి, హేమంత్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు.

## చోరీకి పాల్పడుతున్న పనిమనిషిపై కేసు

**సనత్‌నగర్:** పని చేస్తున్న ఇంట్లోనే చోరీ చేస్తున్న మహిళపై కేసు నమోదైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. బేగంపేటలోని ది విండర్స్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న అవంతి ఇంట్లోని బీరువాలో అప్పుడప్పుడు నగదు చోరీకి గురయ్యేది. సీసీ ఫుటేజీ పరిశీలించగా ఇంట్లో పనిచేస్తున్న మహిళ చోరీ చేసినట్లు గుర్తించారు. అక్టోబర్ 2022 నుంచి జనవరి 2023 వరకు మొత్తం రూ.1.80 లక్షలు చోరీ అయినట్లు గుర్తించారు. చోరీ చేసిన మహిళను ప్రశ్నించగా చోరీ చేసిన డబ్బంతా తిరిగి ఇస్తానని అందరి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఎంతకీ చెల్లించకపోవడంతో అవంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## ట్రాఫిక్ పోలీసులపై దాడి.. ఇద్దరిపై కేసు

**సనత్‌నగర్:** మద్యంమత్తులో ట్రాఫిక్ పోలీసులపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంపేట ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఇతర సిబ్బంది శుక్రవారం అర్ధరాత్రి వరకు బేగంపేట షాపర్స్ స్టాప్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా తలపూడి చరణ్‌కుమార్, సాయికిరణ్ ఇద్దరూ మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై వచ్చారు. వీరిని ఆపిన ట్రాఫిక్ పోలీసులు శ్వాస పరీక్ష నిర్వహించగా వాహనం నడుపుతున్న చరణ్‌కుమార్‌కు 110 రీడింగ్ రావడంతో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ భూషణ్‌రావు ఈ–చలానా డీడీని తీస్తుండగా చరణ్‌కుమార్ భూషణ్‌రావుపై దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా మద్యం తాగిన ఇద్దరు రోడ్డుపై కూర్చుని రాకపోకలకు ఆటంకం కలిగించారు. అనంతరం ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మధుబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## మత సామరస్యానికి ప్రతీక.. గ్యార్వీ షరీఫ్ వేడుక



గ్యార్వీ షరీఫ్ వేడుకలను ఆదివారం బన్సీలాల్‌పేట్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ.. గ్యార్వీ షరీఫ్ వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, శ్రీనివాస్, ముళి, రాజు పాల్గొన్నారు. –పద్మారావునగర్